
# నవ్వు

కస్తూరి మురళీకృష్ణ



కథ

సెల్‌ఫోన్ మోగింది.

ఉలిక్కిపడి లేచాను.

అప్పుడప్పుడే గాఢ నిద్రలోకి జారుకుంటున్న నాకు ఫోను మోతతో మెలకువ వచ్చింది. చిరాకు వచ్చింది. కోపం వచ్చింది. రాత్రి రెండయింది.

సెల్‌లో అపరిచితమైన నెంబరు కనిపించటంతో కోపం పెరిగిపోయింది. ఇది కనక రాంగ్ కాల్ అయితే...? విసురుగా 'హలో' అన్నాను, నా కోపం, చిరాకు అన్నీ ప్రదర్శిస్తూ.

'సారీ సార్... అర్ధరాత్రి డిస్టర్బ్ చేస్తున్నాను. మీకు మృదు మంజీర పరిచయమా?'

'మృదుమంజీర' పేరు వినగానే అలెర్టయ్యాను.

'తెలుసు. ఆమె నా పర్సనల్ సెక్రటరీ' చెప్పాను.

'సార్... మీరు అర్జంటుగా రావాలి. ఆమె నిద్రమాత్రలు మింగింది. ఆస్పత్రిలో చేర్చాము. ఆమె సెల్ ఫోన్‌లో మీ నెంబరు చూసి ఫోను చేస్తున్నాను'.

ఆస్పత్రి ఎక్కడుందో కనుక్కుని గబగబా తయారయ్యాను.

***

అప్లికేషన్‌లో 'మృదుమంజీర' అన్న పేరు చూడగానే నాకు ఆ అమ్మాయి పట్ల కుతూహలం కలిగింది. అమ్మాయిని చూడగానే ఆకర్షితుడనయ్యాను. అందుకే, ఆమెకన్నా తెలివైన అభ్యర్థులు ఉన్నా, ఆమెనే పర్సనల్ సెక్రటరీగా ఎన్నుకున్నాను. అయితే, అందుకు బాధపడే అవకాశం ఆమె ఇవ్వలేదు. పని చక్కగా చేసేది.

మృదుమంజీరలో ప్రత్యేకత ఏమిటంటే, ఆమె ఒక్కమాట అనవసరంగా మాట్లాడదు. ఇతర స్టాఫ్ ఎవరయినా ఏమాత్రం అనవసరమైన మాట మాట్లాడినా వెంటనే అక్కడినుంచి వెళ్లిపోతుంది. ఎవరయినా చనువుగా ఉండాలని ప్రయత్నిస్తే, నిర్మొహమాటంగా వారు మరోసారి ఆమె పరిసర ప్రాంతాలకు రానట్టు సమాధానం ఇచ్చేది.

ఇవన్నీ చూస్తూంటే నాకు మృదుమంజీర అంటే ఇష్టం పెరిగిపోతోంది. అబ్బాయిలు, తమ భార్యలు వర్జిన్(కన్య)గా ఉండాలని కోరుకోవటం దురాశ అయినా కాలంలో మృదుమంజీర లాంటి అమ్మాయివైపు ఆకర్షితులవటంలో అసాధారణం ఏమీలేదు. అయితే, ఆమెతో ఒక్కమాట అధికంగా మాట్లాడే ధైర్యం చేయలేకపోయాను. అప్పుడప్పుడు ఆమె వివరాలు తెలుసుకోవాలని, అమ్మ, నాన్నల గురించి అడిగాను. ఆమె సమాధానం ఇవ్వలేదు.

'నా పర్సనల్ విషయాలు అడగకండి' అని నిర్మొహమాటంగా చెప్పింది.

అహం దెబ్బతిన్నా, 'ఆమె ఇష్టం ఆమెది' అని సర్దిచెప్పుకున్నాను.

ఓ అందమైన అమ్మాయి, రోజు ఎదురుగా తిరుగుతూంటే ఎంత నిగ్రహంగా ఉండాలనుకున్నా, మగవాడి కోతిబుద్ధి తోక తప్పకుండా ఊపుతుంది. అందుకే, ఓ బలహీన క్షణంలో, చాలా కాజువల్‌గా అడిగినట్టు అడిగాను. 'ఇవ్వాళ నేను లంచ్ బయట చేస్తున్నాను, ఒంటరిగా, కంపెనీ ఇస్తారా?'

ఆమె నా వైపు చూసిన చూపు నన్ను గడగడ వణికించింది. ఆమె చూపులో కోపం లేదు. అసహ్యం లేదు. ఓ రకమైన నిర్లిప్తత, వైరాగ్యాలు స్పష్టంగా కనిపించాయి. అన్ని కోరికలు, ఆశలు నశించిన జీవచ్ఛవం చూపు అది.

అలా చూసి మౌనంగా వెళ్లిపోయింది. అయిదు నిమిషాల్లో ఆమె రాజీనామా నా టేబిల్‌పైకి వచ్చింది.

వెంటనే ఆమెను లోపలకు పిలిచాను. ఏడ్చినట్టు కళ్లు ఎర్రగా ఉన్నాయి. ఆమె ముందే రాజీనామాను చింపేశాను.

'అయామ్ సారీ. ఇంకెప్పుడూ ఇలా జరగదు' మనస్ఫూర్తిగా వాగ్దానం చేశాను. 'ఈ కారణంగా నిన్ను అనవసరంగా ఇబ్బంది పెట్టను. నా వల్ల పొరపాటు జరిగింది. జరిగింది మరచిపో.' ఆమె కళ్లల్లో అపనమ్మకాన్ని చూసి రెట్టించి చెప్పాను.

మాట్లాడకుండా వెళ్లిపోయింది. ఆరోజు నుంచీ మృదుమంజీరను మరింత కుతూహలంతో, గౌరవంతో గమనించటం ఆరంభించాను.

ఆమె మగవారితోనే కాదు, ఆడవారితోనూ మాట్లాడదు. అందరితో అంటీ ముట్టనట్టు ఉంటుంది. చాలా సెన్సిటివ్. ఎటువంటి విమర్శలు భరించలేదు.

ఇదంతా చూస్తుంటే నాకు చాలా బాధగా అనిపించింది.

సాధారణంగా పురుషుడి దృష్టి అందమైన స్త్రీ రూపాన్ని దాటిపోదు. కానీ... ఆమె అందమైన బాహ్యరూపాన్ని దాటి, ఆమె

అంతరంగాన్ని చూడగలిగితే... ఆమె మనసులోకి తొంగి చూడ గలిగితే... లోపల ఎన్ని గాయాలుంటాయో!

వేణువు గాయాలు పైకి కనిపిస్తాయి. లోపల మధురమైన సంగీతం ఇమిడి ఉంటుంది. స్త్రీ పైకి అందంగా కనిపిస్తుంది. లోపల దుర్భరమైన విషాదాలుంటాయి. వేదనలుంటాయి. చెరిగి పోని గాయాలుంటాయి. వేణువు లోపలి రాగాలను శోధించి పలికించే మనిషి, స్త్రీ మనసును అర్థం చేసుకోవాలని అనుకోడు. ఆమె గాయాలను మాన్పే ప్రయత్నం చేయడు.

మృదుమంజీర ఓ స్వామీజీ వేదాంత ప్రసంగాలకు క్రమం తప్పకుండా వెళ్తుందని తెలుసుకున్నాను. నేనూ ఆ ప్రసంగాలకు వెళ్లాను. అయితే, అక్కడ నన్ను చూసినా, నేనెవరో తెలియనట్టు ప్రవర్తించేది. దాంతో, ఆ ఉపన్యాసాలు భరించలేక ఆ వైపు వెళ్లటం మానుకున్నాను.

'ఏమిటీ అమ్మాయి, యవ్వనంలో వేదాంతం అనీ, ఆధ్యాత్మికం అనీ తిరుగుతోంది' అనుకున్నాను.

ఓ రోజు మా ఆఫీసులో మీటింగ్ జరిగింది. మా పార్ట్నర్లు, డైరెక్టర్లు వచ్చారు. వారిలో డాక్టర్ మహేంద్ర కూడా ఉన్నాడు. మహేంద్ర సైకియాట్రిస్టు.

వాడు, మృదుమంజీరను చూస్తూనే, 'అరే, ఈ అమ్మాయి ఇక్కడ ఉద్యోగం చేస్తోందా?' అనడిగాడు.

'ఏం? నీకు తెలుసా?' అడిగాను.

వేణువు గాయాలు పైకి కనిపిస్తాయి. లోపల మధురమైన సంగీతం ఇమిడి ఉంటుంది. స్త్రీ పైకి అందంగా కనిపిస్తుంది. లోపల దుర్భరమైన విషాదాలుంటాయి. వేదనలుంటాయి. చెరిగిపోని గాయాలుంటాయి. వేణువు లోపలి రాగాలను శోధించి పలికించే మనిషి, స్త్రీ మనసును అర్థం చేసుకోవాలని అనుకోడు. ఆమె గాయాలను మాన్పే ప్రయత్నం చేయడు.



'తెలుసు' అన్నాడు. ఏం తెలుసో, ఎలా తెలుసో అడిగేలోగా మీటింగ్ ఆరంభమయింది. నా ప్రశ్న అడగకుండా ఉండిపోయింది.

మీటింగ్ అయిన తరువాత మహేంద్ర ఒంటరిగా దొరకలేదు. ఫోన్ చేసి ప్రత్యేకంగా ఆమె గురించి అడగటం బాగుండదని ఊరుకున్నాను.

అయితే, మీటింగ్ సగం నుంచే మృదుమంజీర కనబడలేదు. తరువాత ఆఫీసుకి రావటం మానుకుంది. సెల్‌ఫోన్ ఆఫ్ చేసి ఉంది. ఏం చేయాలో తోచలేదు. చివరికి, బయోడాటాలో ఆమె ఇచ్చిన ఇంటి అడ్రసు వెతికి తీశాను. ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాను.

తలుపు తీసి, నన్ను చూసి ముఖం చిట్లించింది. నా ముఖం మీదే తలుపు వేసి పొమ్మంటుందేమోనని భయపడ్డాను కానీ అలా జరగలేదు. అయిష్టంగా, లోపలకు రమ్మని ఆహ్వానించింది.

'ఆఫీసుకి రావటం లేదేం?' సూటిగా అడిగాను.

'ఎందుకు రావాలి? మీ అందరి హేళనలు, వెక్కిరింతలు భరించటానికా?' కోపంగా అడిగింది. కానీ ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

'నిన్ను హేళన చేసేవారెవరు?' అయోమయంగా అడిగాను.

'వచ్చాడుగా డాక్టర్ మహేంద్ర. ఈ పాటికి అందరికీ నా గురించి తెలిసిపోయి ఉంటుంది' అంటూ రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఏడవటం ఆరంభించింది.

ఆ ఏడుపు మామూలుగా లేదు. హృదయ విదారకంగా ఉంది. ఎన్నెన్నో జన్మజన్మాంతరాల దుఃఖం, ఆత్మ లోలోతుల నుండి తన్నుకుని వస్తున్నట్టుగా ఉంది.

జాలిగా చూస్తూ కూర్చున్నాను. ఏడుపు ఉధృతం తగ్గిన తరువాత చెప్పాను.

'మహేంద్ర ప్రొఫెషనల్. పేషెంట్ల వ్యక్తిగత విషయాలు బహిరంగం చేయడు. అదీగాక పని కట్టుకుని మీ వ్యక్తిగత విషయాలను తెలుసుకుని, మిమ్మల్ని చులకన చేయాలన్న ఆసక్తి ఎవరికీ లేదు. వ్యక్తిగతంగా మీరు ఎవరు, ఏమిటి అన్నది నాకు అనవసరం. నాకు కావలసింది పని. రేపటి నుంచి రండి. మిమ్మల్ని ఎవరైనా ఏమైనా అంటే నాకు చెప్పండి' అని వచ్చేశాను.

ఎందుకో రాత్రంతా మృదుమంజీర ఏడుపు గుర్తుకువచ్చి నిద్ర పట్టలేదు. నిద్ర పడుతూండగా ఫోను వచ్చింది.

***

కారు ఆస్పత్రి ముందు ఆపాను. రిసెప్షన్‌లో మృదుమంజీర గురించి అడుగుతుంటేనే ఓ వ్యక్తి నా దగ్గరకు వచ్చి తనని తాను పరిచయం చేసుకున్నాడు. అతడు మంజీర పక్కింటాయనట. రాత్రి డ్యూటీ ముగించి ఇంటికి వస్తూంటే, ఇంటి గుమ్మం ముందు పడి ఉన్న ఆమె కనిపించిందిహాస్పిటల్‌కి ఫోనుచేసి నాకు ఫోను చేశాడు.'

మాకీమెతో అసలు పరిచయం లేదండి. పేరు కూడా సరిగ్గా తెలియదు. ఎవ్వరితో కలవదు. మాట్లాడదు. ఇప్పుడు కూడా గుమ్మం దగ్గర పడి ఉంది కాబట్టి చూశాను. ఇంట్లోనే పడి ఉంటే, వారం పది రోజులయితే కానీ తెలిసేది కాదు'

చెప్పేసి తన పని అయిపోయినట్టు వెళ్లిపోయాడు.

మృదుమంజీర కోలుకునేసరికి రెండు రోజులు పట్టింది. అన్ని రోజులు దగ్గరే ఉన్నాను.

ఆమె కాస్త మాట్లాడే స్థితికి రాగానే అడిగాను 'మీ వాళ్ల అడ్రసులేవైనా ఇస్తే తెలియ పరుస్తాను'.

ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి 'నాకందరూ ఉన్నారు. కానీ ఎవ్వరూ లేరు' అంది.

ఏమనాలో తెలియలేదు. ఇంతలో ఆమె

అంది. 'మీరు బయోడాటాలో నాన్నపేరు చూశారు. కానీ మా అమ్మ పేరు మీకు తెలియదు'.

ప్రశ్నార్థకంగా చూశాను.

'మా అమ్మ పేరు కళ్యాణి గొప్ప రచయిత్రి. స్త్రీ ఉద్ధకురాలు. కలం పేరు గంగ.'

ఆ పేరు వినగానే నా ముఖంలో రంగులు మారేయి. నా మనసులో భావాలు ముఖంపై కనబడకుండా జాగ్రత్త పడ్డాను. ఒకవేళ కనబడినా గమనించే స్థితిలో లేదామె.

'మా అమ్మ స్త్రీ ఉద్ధరణ కోసం కలం పట్టుకుంది. స్త్రీ విముక్తి కోసం రచనలు చేసింది. స్త్రీ స్వేచ్ఛ కోసం ఉద్యమించింది. వివాహ వ్యవస్థపై తిరుగుబాటు చేసింది. కానీ, అమ్మ కోరిన స్త్రీ స్వేచ్ఛ ఏమిటో తెలుసా?

నాకు తెలుసు. కానీ నేనేమీ మాట్లాడలేదు.

మృదు మంజీర చెప్తూ పోతోంది. ఇన్నేళ్లు ఆమె తనలో అణచిపెట్టిన ఆవేదనలు కట్టలు తెంచుకుని బయటకు రాసాగాయి.

'మా అమ్మ దృష్టిలో స్త్రీ స్వేచ్ఛ, విముక్తి, ఉద్ధరణ అన్నీ లైంగిక సంబంధాలే. లైంగిక స్వేచ్ఛనే స్త్రీ స్వేచ్ఛ అని భావించింది అమ్మ. శరీరానికి ప్రాధ్యానం ఇచ్చింది. మనసును విస్మరించింది. ఎవరు నచ్చితే వారితో ఉండటమే 'విముక్తి' అన్నట్టు ప్రచారం చేసింది. శారీరక సౌఖ్యమే స్త్రీకి జీవితంలో ప్రధానాంశం అంటూ రచనలు చేసింది. అలాగే జీవించింది. నాన్నను వదిలేసింది. నన్ను తీసుకుని కొత్త నాన్నతో ఉండటం మొదలుపెట్టింది. కానీ ఆయనతో ఎక్కువ కాలం ఉండలేదు. నచ్చినవాడితో ఉండటమే కదా స్త్రీ అభివృద్ధికి నిదర్శనం'. తన లైంగిక అనుభవాలను, నిరాశలను పచ్చిగా, విపులంగా వర్ణిస్తూ రచనలు చేసింది. ఆమెని పొగడుతూ బోలెడంత మంది మగవాళ్లు అమ్మ చుట్టూ చేరారు. స్త్రీ రహస్యాల గుట్టు విప్పి విముక్తి నిచ్చిన మహిళగా కొనియాడారు. దాంతో అమ్మ మరింత పచ్చిగా రాయటం ఆరంభించింది. అమ్మను చూసి అనేకమంది మహిళలు లైంగిక స్వేచ్ఛ కోసం తాళులు తెంపుకుని వచ్చారు. అందరూ విచ్చలవిడిగా ప్రవర్తించారు. శరీరం తప్ప స్త్రీకి మరొకటి లేదన్న మగవాళ్ల ఆలోచనను బలపరిచేసి అదే స్త్రీ ఆత్మగౌరవం అన్నారు.

అమ్మపై విమర్శలు కూడా వచ్చాయి. కానీ విమర్శలెన్ని వస్తే, అంతగా రెచ్చిపోయింది అమ్మ. ఆధునిక లిబరేటెడ్ బోల్డ్ వుమన్‌కి ప్రతీక అయింది. అయితే... అమ్మ రాసినవి చదువుతూ, ప్రవర్తన చూస్తూ... నేనెలా భావిస్తానన్న ఆలోచన అమ్మకు రాలేదు. అమ్మ రాతలు చదువుతూంటే నలుగురిలో నన్ను నగ్నంగా నిలిపి, నా అణువణువునూ ప్రపంచం శల్య పరీక్షకు గురిచేస్తున్నట్టనిపించేది.

స్కూల్లో అందరూ వింత సెక్స్ జంతువును చూసినట్టు చూసేవారు. వెర్రి మొర్రి వ్యాఖ్యలు చేసేవారు. నాకు వినబడేట్టు అమ్మ అనుభవించి రచించిన సెక్స్ వర్ణనలు చేసేవారు. అమ్మలానే నేనూ... అనుకున్నారు.

ఇవన్నీ ఒక ఎత్తు... అమ్మతో ఉన్నవాళ్ల ప్రవర్తన ఒక ఎత్తు. నేనూ అలానే అనుకున్నారు. నేను కాదంటే సిద్ధాంతాలు చెప్పేవారు. నాకు అసహ్యం అనిపించింది. డబ్బు కోసం శరీరం అర్పించటం వ్యభిచారం, నేరం. స్వేచ్ఛగా కనబడినవాడితో తిరగటం ఆదర్శం, అభివృద్ధి! నాకు అసహ్యం అనిపించింది. అమ్మ తన ఇష్టం వచ్చినట్టు బ్రతుకుతోంది. తన జీవితం తాను ఎంజాయ్ చేస్తోంది. మరి నా జీవితం నా ఇష్టం కాదు! అమ్మ ఇష్టమే నా ఇష్టం కాదుకదా! అమ్మ దృష్టిలో లైంగిక సంతృప్తికే ప్రాధాన్యం. నా దృష్టిలో ఆత్మగౌరవం అసలు గౌరవం'.

మృదుమంజీర కళ్లల్లోంచి నీళ్లు కారుతున్నాయి. అయినా అలానే కొనసాగించింది.

'కాలేజీలో నా బ్రతుకు దుర్భరం అయింది. అందరూ నన్ను సెక్స్ వస్తువులా, దాని కోసం ఎదురుచూస్తూ పిలవకముందే మీదపడి సిద్ధమైపోయేదానిలా చూశారు. చివరికి విసిగి నేనూ అమ్మలా విచ్చలవిడిగా ఉండాలని ప్రయత్నించాను. మనసు ఒప్పుకోలేదు. మగవాడు తాకితే కంపరం అనిపించేది.మనసును నిద్ర పుచ్చేందుకు డ్రగ్స్ అలవాటు చేసుకున్నాను. మత్తుకు బానిస అయ్యాను. అయితే, నన్ను చూస్తే నాకు అసహ్యమనిపించేది. అమ్మ సిద్ధాంతం అమ్మనే తప్ప అందరు స్త్రీలకు వర్తించదని అర్థం చేసుకున్నాను. అపవిత్రమైన శరీరంతో బ్రతకకూడదని నిశ్చయించుకున్నాను. ఆత్మహత్య చేసుకున్నాను. కానీ ఛావలేదు.

అప్పుడే డాక్టర్ మహేంద్ర పరిచయమయ్యాడు. కోలుకున్నాను. కానీ నా వల్ల తనకు చెడ్డపేరు వస్తోందని అమ్మ బాధపడేది. అంతేతప్ప నా గురించి అమ్మకు బాధలేదు. అందుకే ఓ రోజు చెప్పపెట్టకుండా వచ్చేశాను దూరంగా. పేరు మార్చుకున్నాను. ఉద్యోగంలో చేరాను. నాకు స్త్రీ పురుష సంబంధాలంటేనే అసహ్యం. మనుషులంటే అసహ్యం... మొన్న మహేంద్ర నన్ను చూసి అమ్మకు నేను ఇక్కడున్నానని చెప్పాడు. నా అడ్రసు కనుక్కుని అమ్మ ఇంటికి వచ్చింది. మీరు వచ్చి వెళ్లిన కాస్సేపటికి వచ్చింది. తిట్టింది. నాకు బ్రతకటం రాదంది. జీవితం అనుభవించటం రాదంది.

మా అమ్మ ఇష్టమే నా ఇష్టం కావాలా? మనుషులంతా మూస పోసినట్టు ఉండాలా? వ్యక్తిగత బలహీనతలకు ఆదర్శం ముసుగువేసి సార్వజనీనం చేసి ఆదర్శంగా ప్రచారం చేస్తే సరిపోతుందా? అందరూ అదే బలహీనతలతో ఉండాలని రూలుందా? అందుకే నాకు బ్రతకాలనిపించలేదు. క్షణక్షణం ఈ బాధను భరించలేను. అందుకే...' పెద్దగా ఏడవటం ఆరంభించింది.

వ్యక్తులు తమ కెరీర్లు, తమ జీవితాలు, తమ సౌఖ్యాలు అని స్వార్థంగా ఆలోచిస్తూ, నియమాలను ఉల్లంఘించటమే అభివృద్ధి అని, విచ్చలవిడిగా ప్రవర్తించటమే ఆధునికం అని 'రేపు' లేనటువంటి అనాథల్లా విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. తమ ప్రవర్తన ప్రభావం తరువాత తరాల వారిపై ఉంటుందన్న ఆలోచన ప్రదర్శించటం లేదు. తాము భావితరాలకు జవాబివ్వాల్సి ఉంటుందన్న విచక్షణ చూపటం లేదు.

హఠాత్తుగా నా చెయ్యి పట్టుకుంది మంజీర. 'నాకు మగవారంటే అసహ్యం. కానీ మీ పట్ల గౌరవభావం కలుగుతోంది. మీరు అందరిలాంటివారు కాదు' ఏడుస్తూ ఏదేదో అంటోంది.

కొద్దిసేపటిక్రితందాకా ఈ స్పర్శ కోసం తపించాను. కానీ ఇప్పుడు ఆమె చెయ్యి నా చేతిలో చల్లగా, మెత్తగా తగులుతోంది. అంతే...

**'మా అమ్మ స్త్రీ ఉద్ధరణ కోసం కలం పట్టుకుంది. స్త్రీ, విముక్తి కోసం రచనలు చేసింది. స్త్రీ స్వేచ్ఛ కోసం ఉద్యమించింది. వివాహ వ్యవస్థపై తిరుగుబాటు చేసింది. కానీ, అమ్మ కోరిన స్త్రీ, స్వేచ్ఛ ఏమిటో తెలుసా?**



నాకు నవ్వు వచ్చింది. బిగ్గరగా నవ్వాను. బిత్తరపోయి చూసింది.

'మృదుమంజీరా... మీ అమ్మ ప్రభావంలో పడ్డవారిలో మా నాన్న కూడా ఉన్నాడు. అమ్మని మమ్మల్ని వదిలేశాడు. మీ అమ్మతో కొన్నాళ్లున్నాడు. అయితే, నాన్న వదలివెళ్లినా అమ్మ మమ్మల్ని కష్టపడి పెంచింది. నా జీవితం, నా సౌఖ్యం పిల్లల కోసం ఎందుకు త్యాగం చేయాలని మమ్మల్ని వీధిన వదలిపోలేదు. మమ్మల్ని చదివించింది. మనుషుల్లా నిలబెట్టింది. తన జీవిత సౌఖ్యాలను మా కోసం త్యాగం చేసింది. మా అమ్మ జీవితం మీ అమ్మ సిద్ధాంతాలలోని డొల్లతనాన్ని స్పష్టం చేస్తుంది. నా దృష్టిలో స్త్రీ ఆత్మగౌరవానికి, అత్యుత్తమ ప్రతీక మా అమ్మ. స్త్రీ శక్తికి మా అమ్మ నిదర్శనం. అందుకే నాకు యువతుల పట్ల కుతూహలం ఉన్నా చులకనభావం లేదు. అందుకే నీతో అనుచితంగా ప్రవర్తించలేకపోయాను. మనలోని ఏదో సంస్కారం మనల్ని రక్షించింది'. అర్థం కానట్టు అయోమయంగా చూసింది నా వైపు.

'మృదు మంజీరా... మా నాన్న కొన్నాళ్లు మీ అమ్మతో ఉన్నాడు. అంటే... నువ్వు నాకు చెల్లెలివి అవుతావు' అంటూ పెద్దగా నవ్వటం ఆరంభించాను.

ఆశ్చర్యంగా చూసింది. వెంటనే 'అన్నయ్యా' అంటూ వ్యంగం, వేదనలు కలగలిపి పెద్దగా నవ్వటం ఆరంభించింది.

మా ఇద్దరి నవ్వులు వికృతంగా ధ్వనించాయి. మానసిక వికృతులకు సిద్ధాంతాల ముసుగులు వేసి భవిష్యత్తు తరాల గురించి ఆలోచన లేక ప్రవర్తించేవారి ప్రవర్తనల దుష్ఫలితాలను అనుభవించే భవిష్యత్తు, వర్తమానాలు కలసి నవ్వుతున్నట్టుంది మా నవ్వు. అది ఆస్పత్రి అంతా ప్రతిధ్వనిస్తోంది. మీకూ వినిపిస్తోందా మా నవ్వు?